
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.131	190	216
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 18.0

యాదగిరి క్షేత్రానికి ఆధ్యాత్మిక శోభ



- రెండు నెలల్లో వరుస వార్షిక మహోత్సవాలు
- పాతగుట్టలో వచ్చే నెల 15 నుంచి అధ్యయనోత్సవాలు
- 19 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు
- మార్చి 5 నుంచి శివరాత్రి మహోత్సవాలు
- 11 నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, జనవరి 29: రాష్ట్రంలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధి రాబోయే రెండు నెలల్లో వరుస వార్షిక మహోత్సవాలకు వేదిక కానుంది. వచ్చే ఫిబ్రవరి, మార్చి నెలల్లో పాతగుట్ట, యాదగిరికొండపై స్వయంభు పాంచనారసింహుల వార్షిక బ్రహ్మోత్సవాలు, కొండపైన అనుబంధ శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు కొనసాగనున్నాయి. వచ్చే నెల (ఫిబ్రవరి) 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పాత గుట్ట లక్ష్మీనృసింహుడి దేవాలయంలో నాలుగు రోజుల పాటు వార్షిక అధ్యయనోత్సవాలు, 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పాతగుట్ట ఆలయంలో వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు, మార్చి 5నుంచి 10 వరకు శివాలయంలో శివరాత్రి మహోత్సవాలు, మార్చి 11 నుంచి 21 వరకు అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, స్వయంభు పాంచ నారసింహుడి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ప్రతీ సంవత్సరం ఈ వరుస వేడుకలను దేవస్థాన అధికారులు అంగరంగ వైభవంగా, శోభాయమానంగా, నయనానందకరంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

పాతగుట్టలో ఫిబ్రవరి 19 నుంచి అధ్యయనోత్సవాలు


గుట్ట దేవస్థాన అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 18 వరకు వార్షిక అధ్యయనోత్సవాలు, 19 నుంచి 23 వరకు వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. ప్రతీ సంవత్సరం పాతగుట్ట దేవాలయంలో వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు ముందుగా ఆలయ ప్రాశస్త్యం మరింత ఇనుమడింపజేసేందుకు అధ్యయనోత్సవాలు నిర్వహించడం సంప్రదాయం. అధ్యయనోత్సవాల్లో లక్ష్మీనృసింహుడు వివిధ వాహన సేవల్లో దశావతారాల్లో భక్తులకు దర్శనమిచ్చి తరింపజేస్తాడు. ఫిబ్రవరి 19న పాంచహ్నిక దీక్షలో స్వస్తి పుణ్యాహవాచనంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం పలుకుతారు. ఫిబ్రవరి 20న ధ్వజారోహణం, ముక్కోటి దేవతలను ఉత్సవాలకు ఆహ్వానించే ఘట్టం దేవతాహ్వానం, 21న ఎదుర్కోలు మహోత్సవం, 22న తిరుకల్యాణోత్సవం, 23న దివ్యవిమాన రథోత్సవం, 24న మహాపూర్ణాహుతి, శ్రీచక్రతీర్థ స్నానం, 25న అష్టోత్తర శతఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

మార్చి 5 నుంచి శివరాత్రి మహోత్సవాలు

యాదగిరికొండపైన అనుబంధ శివాలయంలో మార్చి 5వ తేదీ నుంచి 10 వరకు శివరాత్రి మహోత్సవాలు శైవాగమ పద్ధతిలో ఆరంభించనున్నారు. 5న ఉదయం విఘ్నేశ్వరుడికి తొలి పూజలతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. 6న ధ్వజారోహణం, 7న శివపార్వతుల కల్యాణోత్సవం, 8న మహా శివరాత్రి వేడుకలు, 9న లక్షబిల్వార్చనలు, 10న మహాపూర్ణాహుతితో ఈ మహోత్సవాలు ముగుస్తాయి.

మార్చి 11 నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

ఆర్తత్రాణపరాయణుడు, ఏకశిఖరవాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహుడి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు మార్చి 11వ తేదీ నుంచి 21 వరకు నవాహ్నిక దీక్షలో శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించనున్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు నుంచి అలంకార సేవలు, ధార్మిక, సాహిత్య, సంగీత మహా సభలు కొనసాగనున్నాయి. యాదగిరీశుడి బ్రహ్మోత్సవాల్లో ప్రతీ వేడుక, ప్రతీ ఘట్టం దర్శనీయమే. ఈ విశేష పర్వదినాల్లో క్షేత్రాన్ని సందర్శించి తిరువీధి సేవలను దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తరించేందుకు భక్తులు కుటుంబసమేతంగా అధిక సంఖ్యలో తరలివస్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు సైతం ఏర్పాట్లు చేయనున్నారు.



తిరు కల్యాణ బ్రహ్మోత్సవ పర్వాలు..

- 11వ తేదీన ఉదయం ప్రధానాలయ ముఖమండపంలో స్వస్తి పుణ్యాహవాచనం, రాత్రికి అంకురారోపణం.
- 12న ధ్వజారోహణం, వేదపారాయణాలు, సాయంత్రం దేవతాహ్వానం.
- 13 నుంచి 16వ తేదీ అలంకార సేవలు, ధార్మిక సభలు
- 17న రాత్రి స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం
- 18న రాత్రి జగద్కల్యాణకారకుడి తిరుకల్యాణోత్సవం.
- 19న రాత్రి కల్యాణ లక్ష్మీనృసింహుల దివ్యవిమాన రథోత్సవం.
- 20న ఉదయం మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం, రాత్రి డోలోత్సవం.
- 21న అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానం, ఉత్సవ పరిసమాప్తి.

గొర్రెల పంపిణీ లేనట్టే!



- రెండో విడత యూనిట్ల పంపిణీపై నీలినీడలు
- పశుసంవర్ధశాఖను సమీక్షించని ప్రభుత్వం
- డీడీలు చెల్లించిన లబ్ధిదారుల్లో అయోమయం

నల్లగొండ, జనవరి 29: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గొర్రెల యూనిట్ల పంపిణీపై నీలినీడలు అలుముకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రాష్ట్ర స్థాయిలో పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఫైళ్లు మాయమయ్యాయి. అంతేగాక కోట్ల రూపాయల నిధులు ఇతరుల ఖాతాలకు మళ్లాయని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గొర్రెల యూనిట్ల పంపిణీపై దృష్టిసారించి ఈ కేసును ఏసీబీకి అప్పగించింది. ఈ కేసు ప్రభావం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గొర్రెల యూనిట్ల పంపిణీపై పడింది. ఇప్పట్లో గొర్రెల పంపిణీ లేనట్టేనని సమాచారం.



రెండో విడత లేనట్టేనా?

గొర్రెల యూనిట్ల రెండో విడత పంపిణీ నేటికీ అమలుకు నోచుకోలేదు. మొదటి విడతలో నల్లగొండ జిల్లాలో సుమారు 25వేల మందికి గొర్రెలు పంపిణీ చేశారు. రెండో విడత గొర్రెల పంపిణీకి అర్హులు డీడీలు తీశారు. అదే సమయంలో మునుగోడు ఉప ఎన్నిక రావడంతో డీడీలు చెల్లించిన వారిలో కొందరికే గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ కారణంగా మిగతా వారికి పంపిణీ నిలిచింది. రెండో విడతకు జిల్లా పశు వైద్య సంవర్ధకశాఖ అధికారులు మొత్తం 12,856మంది అర్హుల నుంచి డీడీలు తీసుకున్నారు. వారిలో 5,696 మందికి గొర్రెలు పంపిణీ చేశారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ కారణంగా పంపిణీ నిలిచిపోవడంతో మిగతా 7,160 మందికి గొర్రెలు అందలేదు.

హైదరాబాద్ సరిహద్దులోని ఓ జిల్లాలో వెలుగులోకి వచ్చిన అక్రమాలను విచారణ చేస్తున్న ఏసీబీ ఇతర జిల్లాలో కూడా విచారించనున్నట్టు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గతంలో జరిగిన గొర్రెల యూనిట్ల పంపిణీకి సంబంధించిన ఫైళ్లను పరిశీలించే అవకాశం ఉందని పశుసంవర్ధక శాఖలోని ఓ అధికారి తెలిపారు. అర్హులకు గొర్రెలు అందాయా? అవి రీసైక్లింగ్ జరిగాయా? అనే కోణంలో ఏసీబీ విచారించే అవకాశం ఉంది. రీసైక్లింగ్‌లో ఒక నల్లగొండ జిల్లాలోనే సుమారు 80కేసులు నమోదయ్యాయి. ప్రధానంగా దేవరకొండ డివిజన్‌లో ఎక్కువగా గొర్రెల రీసైక్లింగ్ జరిగింది. ఏపీ నుంచి కొనుగోలు చేసుకుని వచ్చిన గొర్రెలను నాగార్జున సాగర్, దామరచర్ల మీదుగా రాష్ట్ర సరిహద్దు దాటించి గొర్రెలను తిరిగి ఏపీలో విక్రయించారు. ఆ సమయంలో ప్రత్యేకంగా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెట్టినా ప్రయోజనం లేకుండా పోయిందనే చర్చ ఉంది.

అయోమయంలో లబ్ధిదారులు

గొర్రెల యూనిట్‌లో 20 గొర్రెలతో పాటు ఒక పొట్టేలు ఉంటుంది. వీటి విలువ రూ.1,58,000. అందులో ప్రభుత్వ సబ్సిడీ పోగా లబ్ధిదారుడి వాటా రూ.43,750లను డీడీల రూపంలో 7,160మంది లబ్ధిదారులు రూ.3.13కోట్లు పశుసంవర్ధకశాఖకు చెల్లించారు. వడ్డీకి డబ్బు తెచ్చి డీడీ ఇచ్చి ఏడాదిన్నర కాలం కావస్తున్నా నేటికీ గొర్రెలు అందలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరినా గొర్రెల పంపిణీ ఊసే ఎత్తలేదు. దీంతో అసలు గొర్రెలు పంపిణీ చేస్తారా? లేదా? అని గొల్లకురుమలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు



మునుగోడు ఉప ఎన్నికకు ముందు గొర్రెల యూనిట్ల పంపిణీ నిలిచింది. డీడీలు చెల్లించిన వారికి ప్రభుత్వ ఆదేశాలు వచ్చాక గొర్రెలు పంపిణీ చేస్తాం. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు లేవు. గొర్రెల పంపిణీపై సమీక్ష నిర్వహించాక స్పష్టత వస్తుంది. జిల్లాలో గొర్రెల యూనిట్ల పంపిణీలో అవకతవకల విషయం మా దృష్టికి రాలేదు. అవకతవకలు జరిగినట్టు దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

ఎంవీ.సుబ్బారావు, నల్లగొండ జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ

శాఖపై సమీక్ష నిర్వహించని ప్రభుత్వం

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండునెలలు కావస్తున్నా ఇంకా ప్రభుత్వం సమీక్ష నిర్వహించలేదు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెల యూనిట్ల పంపిణీపై పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని లబ్ధిదారులు భావించారు. అయితే ఇప్పటి వరకు సమీక్ష నిర్వహించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. లబ్ధిదారులకు డీడీల డబ్బు వాపస్ చేయాలా అని నల్లగొండ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు రాష్ట్ర శాఖకు లేఖతో పాటు నివేదిక పంపారు. అయితే రాష్ట్రస్థాయి అధికారుల నుంచి దీనిపై ఎలాంటి సమాచారం రాలేదు. ప్రభుత్వం నిర్ణయం ప్రకారం ఆలోచన చేద్దామని ఉన్నతస్థాయి అధికారులు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులకు సూచించారు.

గమ్యానికి చేరువలో..

మృత్యు ఒడిలోకి

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాత
- ఛిద్రమైన రెండు కుటుంబాలు



మిర్యాలగూడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వలిగొండ మండలం గొల్నెపల్లికి చెందిన మచ్చేందర్, మాధవి, లియాన్ష్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుంభం

మిర్యాలగూడ అర్బన్, జనవరి 29: ఇష్టదైవాన్ని దర్శించుకోవాలని రెండు కుటుంబాలు పుణ్యక్షేత్రాలకు బయలుదేరాయి. కష్ట, నష్టాలన్నీ తొలగి సుఖశాంతులు ప్రసాదించాలని దేవుళ్లను మొక్కుకొని తిరుగు ప్రయాణమయ్యారు. మరో ఐదు నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకునేలోపు రెండు కుటుంబాలతో ప్రయాణిస్తున్న కారు ఘోర రోడ్డుప్రమాదానికి గురైంది. ఏపీ రాష్ట్రం నుంచి మిర్యాలగూడలోకి ప్రవేశించిన కారు ముందుగా వెళ్తున్న ఓ వాహనాన్ని క్రాస్‌చేస్తుండగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. అదుపుతప్పిన కారు ఏపీ రాష్ట్రం వైపు వాహనాలు ప్రయాణించే రోడ్డుమార్గంలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. సరిగ్గా ఇదే సమయంలో మిర్యాలగూడ నుంచి ఏపీ రాష్ట్రం గుంటూరు వైపు వెళ్తున్న పొట్టులారీ పల్టీ కొట్టిన కారును వేగంగా ఢీకొట్టి సుమారు 50 అడుగుల దూరం ఈడ్చుకెళ్లింది. ఆదివారం అర్ధరాత్రి దాటక జరిగిన ఘోర రోడ్డుప్రమాదంతో కారులోని ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిశాయి. కొన ఊపిరితో ఉన్న మరో మహిళ చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందింది. దీంతో ఆ రెండు కుటుంబాల్లో ఏ ఒక్కరూ మిగల్లేదు.

•7లో..

ఓటింగ్ యంత్రాలపై అవగాహన ఉండాలి

కలెక్టర్ హనుమంతు కె.జెండగె



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగె

భువనగిరి అర్బన్, జనవరి 29: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అందరికీ అవగాహన ఉండాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగె అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాలపై అవగాహన ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ఏడాది జరగనున్న లోకసభ ఎన్నికల సమయానికి ప్రతీ ఒక్కరికి ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాలపై అవగాహన ఉండాలన్నారు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఓటింగ్ యంత్రాల పని తీరును వివరించాలని సూచించారు. అనంతరం పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోదాంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పలు పార్టీల నాయకులు సయ్యద్ ముల్తాన, సోమ రవీందర్‌రెడ్డి, కె.నాగరాజు, బట్టు రామచంద్రయ్య, కలెక్టరేట్ ఏవో జగన్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.నాగేశ్వరచారి, డీటీ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు సుదర్శన్



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

చౌటుప్పల్ టౌన్, జనవరి 29: ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ విఫలమైందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరణల పేరుతో నీరుగార్చడంతోపాటు, మతోన్మాద రాజకీయాలను ప్రోత్సహిస్తూ లబ్ధి పొందేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ మాట్లాడుతూ, మునిసిపాలిటీలోని సమస్యలపై ప్రజా పోరాటాలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో నాయకులు దోనూరు నర్సిరెడ్డి, బండారు నర్సింహ, దండ అరుణ్‌కుమార్, ఎండి. పాషా, అవ్వారు రామేశ్వరీ, గోశిక స్వామి, చీకూరి ఈదయ్య, ఆకుల ధర్మయ్య, ఎర్ర ఊషయ్య, బత్తుల దాసు, వి.శ్రీను, జయమ్మ, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మూసీని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బీబీనగర్, జనవరి 29: ప్రభుత్వ ప్రాధాన్య అంశాల్లో ఒక్కటైన మూసీని ప్రక్షాళించి పర్యాటకంగా తీర్చిదిద్దనున్నట్టు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. తొలుత మహదేవ్‌పూర్‌లోని ప్రాచీన నేపథ్యమున్న అక్కన్న మాదన్న ఆలయాన్ని దర్శించుకొని నూతనంగా నిర్మించిన మినీబస్టాండ్‌ను ప్రారంభించారు. అనంతరం గూడూరు, కొండమడుగు గ్రామంలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను, కొండమడుగు మెట్టు వద్ద స్వాగత ప్రాంగణం, పశు వైద్య ఉప కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, అక్కన్న మాదన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కలెక్టర్ కార్యాలయానికి సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి పేరు పెట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. మూసీని ప్రక్షాళించి పర్యాటకంగా అభివృద్ధి చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన అని అన్నారు. బీబీనగర్-పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి వద్ద మూసీ, అనాజీపూర్ వద్ద చిన్నేటివాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులకు టెండర్లు పిలవనున్నట్టు తెలిపారు. భువనగిరిలో రూ.200కోట్ల వ్యయంతో 10 ఎకరాల్లో మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. భువనగిరి ఖిల్లా రోప్‌వే పనుల కోసం రూ.100కోట్లతో డీపీఆర్‌ను సిద్ధం చేశామన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేస్తున్నామని, రూ.500కు గ్యాస్ సిలిండర్, ప్రతీ గ్రామానికి 100 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల అభివృద్ధికి రూ.120కోట్లు మంజూరు చేశామన్నారు.



గూడూరులో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

కొండమడుగు గ్రామ పంచాయతీ నిర్మాణానికి రూ.60లక్షలు విరాళంగా అందచేసిన పారిశ్రామిక వేత్త చక్రధర్‌రావును ఆయన అభినందించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో రెండు అమలు జరుగుతుండగా, మిగతా వాటిని 100 రోజులలోపు అమలు చేస్తామన్నారు. బొల్లేపల్లి, సంగెం, పోచంపల్లి, గోకారం, బీబీనగర్, మక్తానంతారం, గూడూరు, తాజ్‌పూర్ తదితర రోడ్డు పనులను త్వరితగతిన చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని బునాదిగాని, పిలాయిపల్లి, బొల్లేపల్లి మూసీ కాల్వల విస్తరణ పనులకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జడ్పీచైర్మన్ సందీప్ రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగె, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీటీసీ గోళి ప్రణీత, సర్పంచ్‌లు గడ్డం బాల్‌రెడ్డి, కడెం లత, రాజేశ్ బాబు, వేణుగోపాల్, ఉప సర్పంచ్ దండెం అనిత, ప్రభాకర్, కృష్ణవేణి గోపాల్, నాయకులు శ్యాంగౌడ్, నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సత్తిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, వాసుదేవరెడ్డి, ఆగమయ్యగౌడ్, అచ్చయ్యగౌడ్, బస్వయ్య, బాలకృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

- డీటీవో నరేందర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీటీవో నరేందర్

భువనగిరి టౌన్, జనవరి 29: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని డీటీవో జి.నరేందర్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం భువనగిరిలోని శ్రీనవభారత్ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరంతో పాటు చట్ట రీత్యా నేరమన్నారు. విధిగా డ్రైవింగ్ లైసెన్స్, బీమా ఉండాలన్నారు. సుఖ ప్రయాణాలతో కుటుంబాల్లో శాంతి, సంతోషం ఉంటుందనే వాస్తవాలను విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ప్రభాకర్‌గౌడ్, వైస్‌ప్రిన్సిపాల్ జి.ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరలు అద్భుతం

ఇంగ్లాండ్ దేశ పర్యాటకులు జాన్ రాబర్ట్ దంపతులు



ఇంగ్లాండ్ దేశ పర్యాటకులతో చేనేత వస్త్ర కళాకారుడు సాయిని భరత్

భూదాన్‌పోచంపల్లి, జనవరి 29: పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరల డిజైన్లు అత్యద్భుతమని ఇంగ్లాండ్ దేశానికి చెందిన పర్యాటకులు జాన్ రాబర్ట్ దంపతులు కితాబు ఇచ్చారు. సోమవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించిన జాన్ రాబర్ట్ దంపతులు ఇక్కడి చేనేత కార్మికుల మగ్గాలను పరిశీలించారు. చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరల తయారీ ప్రక్రియలను పరిశీలించి, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు విశ్వవ్యాప్తంగా మంచి గుర్తింపు లభించిందన్నారు. చేనేత కళాకారులు రూపొందించిన డిజైన్లను చూసి ప్రశంసించారు. భారత్ పర్యటనలో భాగంగా వారు ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. వారికి పోచంపల్లి చేనేత వస్త్ర కళాకారుడు సాయిని భరత్ మార్గదర్శనం చేశారు.

'ఆలగడప' ఆణిముత్యం

● కబడ్డీలో జాతీయ స్థాయి ప్రతిభ ● తెలంగాణ కెప్టెన్‌గా లక్ష్మణ్



మిర్యాలగూడ రూరల్, జనవరి 29: వ్యవసాయ కుటుంబం, కూలీ నాలి పనులతో జీవనం సాగించే కార్మిక, కర్షకుల జీవన నేపథ్యం కలిగిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ఆలగడప నుంచి జాతీయ స్థాయి ప్రతిభ కనబర్చాడు నల్లగొండ లక్ష్మణ్. మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామంలో పదో తరగతి వరకు విద్యాభ్యాసం సాగించి, మిర్యాలగూడ పట్టణంలో ఇంటర్ చదివాడు. గిరిజన కుటుంబంలో పుట్టి ప్రతిభా పాటవాన్ని పెంపొందించుకొని నేడు జాతీయ స్థాయిలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. నల్లగొండ వెంకన్న గురువమ్మల రెండో కుమారుడు నల్లగొండ లక్ష్మణ్ చిన్నప్పటి నుంచి తన తండ్రి వారసత్వంగా, గ్రామ కబడ్డీ క్రీడాకారుల ప్రోత్సాహంతో కబడ్డీనే ప్రాణంగా భావించాడు. క్రీడా పోటీలను తన ఆలోచనలతో నింపుకొని అందరి సహకారంతో నేడు జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదిగాడు. గ్రామంలో నిర్వహించే కబడ్డీ పోటీలను ఆసక్తిగా మార్చుకొని కబడ్డీ క్రీడారంగంలోకి ప్రవేశించాడు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ టీం కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.

సాధించిన విజయాలు

అండర్-14 మధ్యప్రదేశ్ నేషనల్ మీట్‌లో 2016, అండర్-17 2018లో పాల్గొన్నాడు. సబ్ జూనియర్ నేషనల్ మీట్‌లో బీహార్‌లో ప్రతిభ చాటాడు. జూనియర్ నేషనల్స్‌లో 2022-23లో ఉత్తరాఖాండ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 2024 జనవరి 11, 12, 13, 14వ తేదీల్లో గజ్వేల్‌లో జరిగిన 33 జిల్లాల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటడంతో జాతీయ స్థాయికి ఎదిగాడు. తన ప్రతిభను గుర్తించిన కబడ్డీ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర టీం కెప్టెన్‌గా ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ కెప్టెన్‌గా లక్ష్మణ్ ఎంపికవడం పట్ల తల్లిదండ్రులు, తోటి మిత్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిషేధిత ఫేస్‌క్రీమ్‌ల పట్టివేత

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో తనిఖీలు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 29: నిషేధిత కంపెనీలకు చెందిన 60ముఖ సౌందర్య ఫేస్ క్రీమ్ ట్యూబ్‌లను ఔషధ నియంత్రణ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి ఈ మేరకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని డాక్టర్స్ కాలనీలో ఇన్‌చార్జి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ముఖ చర్మ రంగుమార్పు, ముడతలు కనిపించకుండా ఉండేలా మెడికల్‌షాపుల్లో కొన్ని రకాల కంపెనీలకు చెందిన క్రీమ్‌లను విక్రయిస్తున్నారు. అధికారులకు అందిన సమాచారం మేరకు మిర్యాలగూడ పట్టణం ఇస్లాంపురలోని గోపికృష్ణ మెడికల్‌షాపులో తనిఖీ చేయగా బీసీఎల్ ఫార్మ కంపెనీకి చెందిన 60 ఫేస్‌క్రీమ్ ట్యూబ్‌లు లభ్యమయ్యాయి. వీటిని హైదరాబాద్ మేడిపల్లిలోని మానస డిస్ట్రిబ్యూటరీ నుంచి దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. ఔషధ నియంత్రణ అధికారులు తనిఖీలకు వచ్చినట్లు సమాచారం అందుకున్న కొందరు మెడికల్ దుకాణాల వ్యాపారులు సోమవారం రాత్రి వరకు తమ దుకాణాలను మూసివేశారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు 'ఆదర్శ' విద్యార్థి

ఢిల్లీలో నిర్వహించనున్న సీనియర్స్ పోటీల్లో పాల్గొననున్న తరుణ్

నిడమనూరు, జనవరి 29: నల్లగొండ జిల్లా మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పేర్ల తరుణ్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. మే నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న సీనియర్స్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో తరుణ్ రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నాడు. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన తమ పాఠశాలకు చెందిన విద్యార్థి తరుణ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ లోగిశెట్టి రంజిత, పీడీ బెజవాడ గిరివరప్రసాద్, అధ్యాపక సిబ్బంది అభినందించారు. పోటీల్లో తమ విద్యార్థి చక్కటి ప్రతిభ కనబర్చి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



పేర్ల తరుణ్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుండాల, జనవరి 29: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ యాకన్న తెలిపిన వివరాల ప్రకారం.. మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓర్సు మైసయ్య (54) గ్రామ శివారులో బహిర్భూమి కోసం వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన చుట్టు పక్కల ప్రాంత రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని ఓర్సు మైసయ్య మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మైసయ్య భార్య ఓర్సు మైసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాకన్న తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

గరిడేపల్లి, జనవరి 29: తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. గడ్డిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు అనంతు చినబిక్షాలు రోజు మాదిరిగా సోమవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కగా మోకు జారి కిందపడిపోయాడు. అటుగా వెళ్తున్న వ్యక్తులు చూసి వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రైలునుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

భువనగిరి రూరల్, జనవరి 29: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపునకు వెళ్తున్న రైలులో నుంచి జారిపడి భువనగిరి- వంగపల్లి రైల్వే స్టేషన్ల మధ్య కిలోమీటర్ నెంబర్ 248/10-12 మైలురాయి వద్ద గుర్తుతెలియని వ్యక్తి జారిపడి మృతిచెందాడు. వయస్సు 40 నుంచి 45సంవత్సరాలు ఉంటాయని, మృతదేహం తెలుపురంగు గీతల షర్టు, బూడిద కలర్ పాయింట్ కుడివైపు పొట్టపై, చాతి కింద పుట్టుల ఉన్నాయని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. సంఘటనా స్థలంలో పంచనామా చేపట్టి కేసు నమోదు చేసుకున్నామని మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9848222169కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గమ్యానికి చేరువలో.. మృత్యు ఒడిలోకి


ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటగిరి



జ్యోతి, మాధవి మృతితో విలపిస్తున్న దత్తత తల్లిదండ్రులు నాగభూషణం,పద్మ

- దైవదర్శనం ముగించుకొని తిరుగు ప్రయాణంలో విషాదం
- వాహనాన్ని క్రాస్‌చేస్తుండగా అదుపుతప్పిన కారు
- డివైడర్ దాటి రోడ్డుపై పల్టీ.. లారీ ఢీ కొట్టి ఈడ్చుకెళ్లిన వైనం
- ఆరుగురు మృత్యువాత.. ఛిద్రమైన రెండు కుటుంబాలు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 29: పుణ్యక్షేత్రాలకు వెళ్లి కారులో తిరిగి వస్తున్న రెండు కుంటుంబాలు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి-నార్కట్‌పల్లి బైపాస్‌రోడ్డుపై ఆదివారం రాత్రి జరిగిన దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందారు. డీఎస్పీ వెంకటగిరి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం నందిపాడు గ్రామానికి చెందిన చెరుపల్లి మహేష్, యాదాద్రి జిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన తన తోడల్లుడు బొమ్మ మశ్చేందర్ కుటుంబసభ్యులు దైవదర్శనం, ఈనెల 26న విహారయాత్రకు వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో మహేష్, మశ్చేందర్ కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న కారు మిర్యాలగూడలోని కృష్ణమాసన కాలనీ వద్ద అద్దంకి - నార్కట్‌పల్లి రోడ్డుపై ఆదివారం రాత్రి రోడ్డుప్రమాదానికి గురైంది. ఓవర్ టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో చెరుపల్లి మహేష్(32), అతని భార్య జ్యోతి(30) కుమార్తె రిషిత(6) యాదాద్రిజిల్లా వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన అతని తోడల్లుడు బొమ్మ మశ్చేందర్(29) కుమారుడు లియాన్స్(2) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. కారు వెనుక సీట్లో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న మశ్చేందర్‌భార్య మాధవి(24)ని స్థానికుల సాయంతో పోలీసులు బయటకు తీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం ఆమె పరిస్థితి విషమించగా మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మాధవి మృతిచెందడంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఏరియా ఆస్పత్రి వద్దకు మృతుల బంధువులు, స్నేహితులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కన్నీరు పెట్టుకున్నారు. నందిపాడు గ్రామానికి చెందిన మహేష్ హైదరా బాద్ వనస్థలిపురంలో నివాసముంటూ అవుట్‌డోర్ ఫొటోగ్రాఫీ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అదేవిధంగా మశ్చేందర్ తన స్వగ్రామమైన గొల్నేపల్లిలో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు.

పేగుబంధం లేకున్నా ప్రేమబంధం పంచి..

నందిపాడు గ్రామానికి చెందిన దేవులపల్లి నాగభూషణం తన సోదరి మంగమ్మ కుమార్తెలైన జ్యోతి, మాధవిలను చిన్నతనంలోనే దత్తత తీసుకున్నాడు. పేదరికంలో ఉన్న తన సోదరికి ఆడపిల్లలు భారంగా మారకూడదన్న భావనతో చేరదీసిన నాగభూషణం, పద్మ దంపతులు సొంత కుమార్తెలుగా భావించి కష్టపడి పోషించారు. ఓ రైస్‌మిల్లులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న నాగభూషణం తన పెంపకంలో ఉన్న జ్యోతిని బీఎస్సీ, బీఈడీ వరకు, మాధవిని బీటెక్ వరకు చదివించి ఎనిమిదేళ్ల క్రితం నందిపాడుకు చెందిన మహేష్‌తో జ్యోతికి పెళ్లిచేయగా, మూడేళ్ల క్రితం మాధవికి మశ్చేందర్‌తో వివాహం జరిపించాడు. మేనకోడళ్లకు ఏ లోటూ రాకుండా కన్నబిడ్డల వలే అల్లారుముద్దుగా పెంచుకున్న జ్యోతి, మాధవీలు విగతజీవులుగా మారడాన్ని ఆ దంపతులు జీర్ణించుకోలేక కన్నీటి పర్యంతమవుతున్నారు. పేగుబంధం లేకపోయినా ప్రేమబంధంతో పెంచుకున్న పిల్లలిద్దరితోపాటు, వారి భార్త పిల్లలు మృత్యుతదేహాల వద్ద పెంపుడుతల్లి (మేనత్త) విలపించిన తీరు పలువురిని కంటతడిపెట్టించింది.

నలుగురికి కంటి చూపు

రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందిన మహేష్, జ్యోతి నేత్రాలను లయన్స్ క్లబ్‌కు దానం చేసేందుకు తల్లి మంగమ్మతోపాటు మేనమామ, అత్త(పెంపుడు తల్లిదండ్రులు) నాగభూషణం- పద్మ అంగీకరించారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రికి చెందిన వైద్యులు నేత్రాలను సేకరించి ఐ బ్యాంక్‌కు తరలించారు. అకాలమరణం చెందిన దంపతుల నేత్రాలతో మరో నలుగురి చూపునిచ్చే అవకాశముంటుందని వైద్యులు తెలిపారు. చిన్నారులు రిషిత, లియాన్స్, మశ్చేందర్, మాధవి దంపతుల నేత్రాలను సైతం సేకరించేందుకు వారి కుటుంబీకులు అంగీకరించినా వైద్య పరీక్షల్లో వారి నేత్రాలు ప్రమాదంలో దెబ్బతిన్నట్లుగా నిర్ధారించి సేకరించలేదు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మిర్యాలగూడ: రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఉన్న మృతదేహాలను చూసి చలించిపోయారు. బంధువులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్ పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబసభ్యులను ఆయన ఫోన్లో పరామర్శించారు.

గొల్నెపల్లిలో విషాదచాయలు

వలిగొండ: మిర్యాలగూడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బొమ్మ మచ్చేందర్, అతని భార్య మాధవి, కుమారుడు లియాన్స్ మృతితో మండలంలో గొల్నెపల్లి గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. దైవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మృత్యువాత పడడంతో గ్రామ శోకసంద్రంగా మారింది. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఎవరినోట విన్నా మచ్చేందర్ కుటుంబం మృతిచెందారన్న చర్చ సాగింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యుల బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తల్లి నాగమ్మ తలకొరివి పెట్టింది. ఆ గ్రామ చివరన ఉన్న స్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. మచ్చేందర్, మాధవి, లీయాన్స్ మృతదేహాలకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు.

140 కిలోమీటర్లు వెళ్లి లారీని పట్టుకున్న పోలీసులు

ప్రమాదానికి కారణమై పరారైన లారీని గుర్తించేందుకు డీఎస్పీ పర్యవేక్షణలో మిర్యాలగూడ పోలీసులు 140 కిలోమీటర్లకు పైగా ప్రయాణించారు. టూ టౌన్ ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన రెండు పోలీస్ బృందాలు పట్టణంలోని నందిపాడు, చింతపల్లి చౌరస్తా సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి లారీని ప్రాథమికంగా గుర్తించారు. ఏపీ రాష్ట్రం పిడుగురాళ్ల టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాలను పరిశీలనలో ముందుభాగం దెబ్బతిన్న టీఎస్12 యూఈ 2383 నెంబర్‌గల లారీని గుర్తించి ఏపీ పోలీసులను సమాచారం అందించారు. అద్దంకి వద్ద ప్రమాదానికి కారణమైన లారీని మిర్యాలగూడ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఆరుగురి మృతికి కారణమైన లారీని పట్టుకునేందుకు శ్రమించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. జ్యోతి తండ్రి నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మృతదేహాలకు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మహేష్, జ్యోతి, రిషిత మృతదేహాలకు నందిపాడులో అంత్యక్రియలు పూర్తిచేయగా, మశ్చేందర్, మాధవి, లియాన్ మృతదేహాలకు యాదాద్రి జిల్లా వలిగొండమండలం గొల్నేపల్లిలో దహనసంస్కారాలు పూర్తిచేశారు. రెండు కుటుంబాలకు చెందిన వారంతా ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయా గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.


వలిగొండ మండలం గొల్నెపల్లిలో మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నడిగూడెం ఉన్నత పాఠశాలను కప్పేసిన మంచు




ఉదయం 9గంటల సమయంలో లైట్ల వెలుగులో వాహనాల రాకపోకలు

అబ్బబ్బో.. మంచువాన

సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల ప్రజలను సోమవారం ఉదయం మంచువాన కప్పేసింది. ఉదయం 5గంటల నుంచి పొగమంచుతో కూడిన మంచు చినుకులు వాహనదారులను ఇబ్బందులకు గురి చేశాయి. ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు ఉన్నత పాఠశాలలో వ్యాయమం చేసేవారు మంచుతో ఇబ్బంది పడ్డారు. సుమారు మూడు గంటల పాటు మంచు కమ్మేయడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే కూలీలు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

● నడిగూడెం

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

వలిగొండ, జనవరి 29: మానసిక పరిస్థితి సరిగా లేక ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిలాల్ల వలిగొండ మండలంలోని గొల్నెపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గొల్నెపల్లి గ్రామానికి చెందిన రాధారపు రమేష్(30) మానసిక స్థితి సరిగా లేక ఆదివారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా రమేష్ భార్య రెండు నెలల క్రితం డెలివరీ నిమిత్తం పుట్టింటికి వెళ్లింది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



నార్కట్‌పల్లి, జనవరి 29: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెరువుగట్టులో గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దేవస్థాన సిబ్బంది సమాచార మేరకు గట్టుపైన రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఓ వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండగా వెళ్లి పరిశీలించే సరికి చనిపోయి ఉన్నాడు. వృద్ధుని వయస్సు 65 సంవత్సరాల ఉంటుందని ఎస్ఐ తెలిపారు. దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అడ్డగూడూరు యువకుడు చెన్నైలో మృతి

అడ్డగూడూరు, జనవరి 29: యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన యువకుడు సోమవారం చెన్నైలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... అడ్డగూడూరు మండలకేంద్రానికి చెందిన గుంజ శ్రీను-సత్తమ్మ దంపతుల కుమారుడు గుంజ చందు(22) ఇటీవలే బీటెక్ పూర్తి చేశాడు. సోమవారం ఉద్యోగ పేస్‌మెంట్ల నిమిత్తం బెంగళూరు వెళ్తున్నట్లు చెప్పి చెన్నైలో రైలు పట్టాలపై విగత జీవిగా కన్పించాడు. చెన్నై పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో విషయం తెలిసింది. మృత్తికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రైవేట్ వ్యక్తులతో వాహనాల తనిఖీలు

కోదాడ రూరల్, జనవరి 29: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధి రామాపురం క్రాస్‌రోడ్డులోని ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వారం రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాగా ఈ తనిఖీలకు ప్రభుత్వ ఉద్యోగులను నియమించకుండా ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసి వారిచే వాహనాల తనిఖీ నిర్వహిస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ మధ్య రోజుకు పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇందులో గూడ్స్ వెహికల్స్ కూడా ఉన్నాయి. విజయవాడ, హైద్రాబాద్ మధ్య భారీ స్థాయిలో వ్యాపారస్థులు కొనుగోళ్లు నిర్వహిస్తుంటారు. కొనుగోలు చేసిన వాటికి సరైన బిల్లులు ఉన్నాయా, లేదా అన్నది వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తమ తనిఖీల్లో తెలుసుకుంటుంటారు. అందులో భాగంగా గత అసెంబ్లీ ఎన్నికల ముందు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే తనిఖీలు నిలుపుదల చేశారు. తిరిగి మరలా వారం, పదిరోజులుగా తనిఖీలు ప్రారంభించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను విచారించగా, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నందున తనిఖీలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినట్లు వారు తెలిపారు. తనిఖీలు నిర్వహించేందుకు సిబ్బందిని నియమించకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేయడం వల్ల వారు వచ్చిపోయే వాహనాలను ఆపి పెద్దఎత్తున డబ్బులు డిమాండ్ చేసి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై వాహనదారులు సైతం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తనిఖీల్లో ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేయడంపై ఎస్టీవో సంపత్‌ను ప్రశ్నించగా, సిబ్బంది లేకపోవడం వల్లే ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.


సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

బంగారం చోరీ నిందితుల రిమాండ్

తిప్పర్తి, జనవరి 29: ద్విచక్ర వాహనంపై వెళ్లి బంగారం చైన్ చోరీ చేసిన నిందితులను సోమవారం తిప్పర్తి పోలీసులు రిమాండ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని ముకుందాపుం గ్రామానికి చెందిన సల్లంగుల శివకుమార్(26), నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన సంపంగి యువరాజ్(23), నల్లగొండ జిల్లాకేంద్రం శ్రీరాంనగర్ కాలనీకి చెందిన సంపంగి వెంకటేష్(26) బంధువులు. వీరు నల్లగొండ పట్టణంలో కూలీ పనులకు వెళ్తుంటారు. ఈ నెల 21న వీరు గొలుసు చోరీకి పథకం వేసుకొని నల్లగొండ మండల పరిదిలోని పెద్ద సూరారం గ్రామానికి చెందిన ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కొని వెళ్లారు. కాగా అదే రోజు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులు, వారి ద్విచక్ర వాహనాన్ని సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. సోమవారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన యువకులను గుర్తు పట్టిన పోలీసులు వారిని పట్టుబడి చేసి వారు చోరీ చేసిన మూడు తులాల బంగారు గొలుసును రికరీ చేసి కోర్టుకు పంపించారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ ఎన్. ధర్మ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేములపల్లి, జనవరి 29: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ డి.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రావులపెంట గ్రామానికి చెందిన జంగిలి యల్లయ్య, పసుల రమేష్‌లు తమ ట్రాక్టర్ల ద్వారా వేములపల్లి మండలంలోని గ్రామ శివారులోగల మూసీ వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



గౌసుకొండ గ్రామానికి చెందిన మల్లేష్ కుటుంబానికి ఎల్‌వోసీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జనవరి 27: గ్రామీణ పేదల సంక్షేమం కోసం, పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గౌసుకొండ గ్రామానికి చెందిన వి.మల్లేష్ కుటుంబానికి అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రి బిల్లుల సహాయార్థం సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌వోసీ చెక్కు. రూ.2.50లక్షల చెక్కును ఆయన అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన 4వ వార్డులోని నల్ల నర్సింహకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ. లక్ష రూపాయల ఎల్‌వోసీ చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, నాయకులు నల్ల లక్ష్మణ్, బాలనర్సింహ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు బంగారు పతకాలు



మోత్కూరు: పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ సైదులు

మోత్కూరు/ అడ్డగూడూరు/ చౌటుప్పల్ టౌన్/ బొమ్మలరామారం, జనవరి 29: హైదరాబాదు సరూరునగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో మోత్కూరు సాయి చైతన్య పాఠశాలకు చెందిన దాచారం గ్రామ విద్యార్థులు ఆరు బంగారు పతకాలు, మూడు వెండి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి సుమారు 3500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కటా విభాగంలో ఎస్.సహస్ర, సిహెచ్.చరణ్‌తేజ్, సిహెచ్.అభిరామ్, ఎస్.సాయివిఘ్నేష్ ఒక్కోటి, ఫైట్ విభాగంలో కుమితే రెండు బంగారు పతకాలు, డి.చరణ్‌గౌడ్ ఒకటి, కుమితే మరో రెండు సిల్వర్ మెడల్స్ సాధించారని కోచ్ డాక్టర్ వి.సైదులు తెలిపారు. తనకు బెస్ట్ కోచింగ్ అవార్డుతో పాటు ఛాంపియన్ కప్పు లభించిందన్నారు. అడ్డగూడూరు మండలంలోని డి.రాపాక విద్యార్థులు ఆదివారం హైదరాబాదులోని సరూర్ నగర్ ఇండోరు స్టేడియంలో ఇంటర్నేషనల్ కరాటే షిష్ మాస్టరు ఆమర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో డి.రాపాక విద్యార్థులు ఈ పోటీల్లో కటా విభాగం, ఫైట్ విభాగంలో కలిపి 11మంది గోల్డ్‌మెడల్స్, సిల్వర్ మెడల్స్ సాధించారు.

● చౌటుప్పల్ పట్టణంలోని ట్రీనిటీ విద్యా సంస్థల విద్యార్థి బి.సిద్దార్థ (7 వ తరగతి) తైక్వాండో జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించారు. ఈ నెల 27, 28 తేదీల్లో కర్నాటకలోని బెంగళూరులో జరిగిన జాతీయ పోటీల్లో సిద్దార్థ అత్యంత ప్రతిభను కనబరచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. బంగారు పతకాన్ని సాధించిన సిద్దార్థ ను ట్రీనిటీ విద్యా సంస్థల చైర్మన్ కృష్ణా రావు, ప్రిన్సిపాల్ వి.మంజుల, సాయి తైక్వాండో కోచ్‌లు శివసాయి, హేమంత్ అభినందించారు.

● బొమ్మలరామారం మండలం గోవింద్ తండాకు చెందిన విద్యార్థులు రోలర్ స్కేటింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో వెండి పతకాలు సాధించారు. చెన్నై జాతీయ స్టేడియంలో స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ఐరిష్ ఎడు వ్యాలీ పాఠశాల తరఫున పాల్గొన్న ఐదో తరగతి విద్యార్థులు ధీరావత్ హర్ష, దీరవత్ భరణి తేజ్, ధీరావత్ ప్రవీణ్, పతకాలు సాధించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



భువనగిరిలో తహసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వ్యకాస నాయకులు

భువనగిరి రూరల్/ మోత్కూరు, జనవరి 29: ఇళ్లు లేని పేదలకు స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యకాస ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయాలని, ఇళ్లు లేని పేదలకు 125 గజాల స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యకాస నాయకులు దయ్యాల నర్సింహ, కె.యాదగిరి, బి.కిషన్, లక్ష్మీనర్సయ్య, నాగరాజు, చంద్రయ్య ఉన్నారు.

● మోత్కూరు మండలంలో ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ డి.రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి, రాములమ్మ, అంజయ్య, సావిత్రి, అనసూర్య పాల్గొన్నారు.

డివైడర్‌పైకి ఎక్కిన ఆర్టీసీ బస్సు

ఆలేరు రూరల్, జనవరి 29: మండల కేంద్రంలో ఆర్టీసి బస్సు అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కింది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న జనగామ డిపోకు చెందిన బస్సు40 మంది ప్రయాణికులతో బయలుదేరింది. ఆలేరులోని స్థానిక జాతీయ రహదారిపై ఉన్న దర్గా సమీపంలోకి రాగానే బస్సు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. డ్రైవర్ వాహనాన్ని అదుపు చేశారు. కొంత మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజిరెడ్డి కన్నుమూత



రాజిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం సీపీఆర్‌వో బొర్రెడ్డి అయోధ్యరెడ్డి

గుండాల, జనవరి 29: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మలిపెద్ది రాజిరెడ్డి (85) సోమవారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతిపట్ల ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సీఎం సీపీఆర్‌వో బొర్రెడ్డి అయోధ్యరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఎంపీపీ తాండ్ర అమరావతి, జడ్పీటీసీ సభ్యురాలు కె.లక్ష్మీ సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

భువనగిరి పీఠం కోసం నేతల పాట్లు

● చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకోసం ఎత్తుకు పైఎత్తులు
● మూడోసారి క్యాంప్‌నకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న కౌన్సిలర్లు
● కౌన్సిలర్ల వైఖరిని తప్పు పడుతున్న ప్రజలు



భువనగిరి మునిసిపల్ కార్యాలయం

భువనగిరి టౌన్, జనవరి 29: భువనగిరి మునిసిపల్ అవిశ్వాస రాజకీయాల్లో రెండో ఘట్టానికి త్వరలో తేదీ ఖరారు కానున్న నేపథ్యంలో మునిసిపల్ రాజకీయాలు ఊహించని స్థాయిలో వేడెక్కుతున్నాయి. కేవలం 10 నెలలు మాత్రమే అధికారంలో ఉండే అవకాశం ఉన్నప్పటికీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఆశావాహులు చేస్తున్న ప్రయత్నాలు, పట్టు కోసం పార్టీలు సాగిస్తున్న మంతనాలు, ఇదే అదనుగా లబ్ధి పొందేందుకు పలువురు కౌన్సిలర్లు చేస్తున్న ప్రయత్నాలు టాక్ అఫ్‌ది టౌన్‌గా మారాయి. బీఆర్ఎస్‌కు చెందిన గత చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్యపై పాలక పక్షానికి చెందిన 16 మంది అసంతృప్త కౌన్సిలర్లు, కాంగ్రెస్, బీజేపీకి చెందిన 15 మంది సభ్యులతో కలిసి ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం ఈ నెల 23న నెగ్గడంతో వారిరువురు పదవీచ్యుతులయ్యారు. అప్పటికే పలువురు సభ్యులకు కానుకల రూపకంలో పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు ప్రచారం కాగా రెండు దఫాలుగా క్యాంప్‌లలో సేద తీరిన చిత్రాలు కూడా వైరల్ అయ్యాయి.

జంట పదవులకోసం యత్నాలు

ఈ నేపథ్యంలో నల్లగొండ మునిసిపల్ చైర్మన్ ఎన్నికకు ఫిబ్రవరి 5న ప్రత్యేక సమావేశం జరుగనున్న నేపథ్యంలో భువనగిరి మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ప్రత్యేక సమావేశం ఫిబ్రవరి 10 లోపు జరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఎలాగైనా ఆ జంట పదవులను దక్కించుకునే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పావులు కదుపుతుండగా బీజేపీ అవకాశాల కోసం ఎదురుచూస్తున్నది. అయితే అన్ని పార్టీలలోనూ లుకలుకలు రోజురోజుకూ తీవ్రమవుతున్నట్లు విస్తృతంగా ప్రచారం అవుతోంది. స్వయం కృతాపరాదంతో మునిసిపాలిటీపై పట్టును కోల్పోయిన బీఆర్ఎస్ తిరిగి పూర్వ వైభవం సాధించేందుకు సమ్మతి, అసమ్మతి వర్గాలు కలిసేలా ఆ పార్టీ ముఖ్య నాయకులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వారి ప్రయత్నాలు ఫలిస్తే వారి సంఖ్యా బలం 20కి చేరి మునిసిపాలిటీపై గులాబీ జెండాను మరోమారు ఎగురవేసే అవకాశాలు ఉన్నాయి. ఇందుకు అనుగుణంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సోమవారం భువనగిరిలో స్పందిస్తూ మునిసిపాలిటీ మరోమారు తమదేనని ప్రకటించడం చర్చకు దారి తీసింది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉండడంతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేనే ఉండడంతో మునిసిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసేందుకు 9 మంది కౌన్సిలర్లు గల కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలను ముమ్మరంగా సాగిస్తోంది. ఇందుకోసం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ కౌన్సిలర్లతో పలు పర్యాయాలు చర్చించి కాంగ్రెస్ అనుకూల, విపక్ష సభ్యులను గుర్తించే పనిలో ఉన్నట్లు ప్రచారం అవుతోంది. అలాగే ఆరుగురు సభ్యులు గల బీజేపీ కూడా అవకాశాలను అందిపుచ్చుకొని లబ్ధి పొందేందుకు తహతహలాడుతున్నట్లు పలువురు అనుకుంటున్నారు. కానీ ప్రజలు మాత్రం కౌన్సిల్ సభ్యులు వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహంగా ఉన్నారు. పట్టణ సమస్యలను గాలికి వదిలేసి స్వప్రయోజనాల కోసం తామిచ్చిన పదవులను దుర్వినియోగం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికల తేదీని అధికారులు ప్రకటించిన వెంటనే ముచ్చటగా మూడోసారి సుమారు 10 రోజుల పాటు క్యాంప్‌లకు వెళ్లేందుకు కౌన్సిలర్లు సిద్ధమవుతున్నట్లు ప్రచారం అవుతోంది. ఏది ఏమైనా మునిసిపల్ రాజకీయాలు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి ప్రతిష్టాత్మకంగా మారినట్లు మునిసిపల్ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీఆర్ఎస్ మునిసిపల్ కౌన్సిలర్లకు విప్ జారీ

మోత్కూరు, జనవరి 29: మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిపై పెట్టిన అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఆదేశిస్తూ సోమవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆ పార్టీ కౌన్సిలర్లకు విప్ జారీ చేశారు. మోత్కూరు మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు 8మంది, కాంగ్రెస్‌కు నలుగురు కౌన్సిలర్లు ఉన్నారు. ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నలుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు కలిసి చైర్‌పర్సన్ సావిత్రిపై అవిశ్వాస నోటీస్ ఇచ్చారు. ఫిబ్రవరి 9న అవిశ్వాస ప్రత్యేక సమావేశంలో ఓటింగ్ నిర్వహించనున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఏడుగురు, కాంగ్రెస్ అభ్యర్థులు ఐదుగురు గెలిచారు. ఆ తర్వాత కాంగ్రెస్ కౌన్సిలర్ ఒకరు బీఆర్ఎస్‌లో చేరగా, ఆ కౌన్సిలర్ విప్ పరిధిలోకి వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లలో అందుబాటులో ఉన్న ముగ్గురికి నేరుగా విప్ పత్రాలు అందజేయగా, అందుబాటులో లేని నలుగురు కౌన్సిలర్ల ఇళ్ల గోడలకు విప్ పత్రాలు అంటించారు. వారికి రిజిస్టర్ పోస్టులో సైతం నోటీసులు పంపారు. విప్ జారీ చేసిన విషయాన్ని కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి దృష్టికి బీఆర్ఎస్ నేతలు తీసుకెళ్లనున్నట్టు సమాచారం.

సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయం



ఆత్మకూరు(ఎం): రాఘవాపురంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య

ఆత్మకూరు(ఎం)/ మోటకొండూర్/ గుండాల/ రాజాపేట: జనవరి 29: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను సబ్బండ వర్గాలకు అందించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని రాఘవాపురం, కూరెళ్ల గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలను, తుక్కాపురంలో పాఠశాల ప్రహరీగోడ, మండల కేంద్రంలోని హైస్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనశాలను ప్రారంభించి, పాఠశాలలో సీసీ నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసి, అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ, వైస్ ఎంపీపీ బి.పద్మ, ఎంపీడీవో నిరంజన్, పీఏసీఎస్ చైర్మన్ జె.శేఖర్‌రెడ్డి, సర్పంచులు దొండ కమలమ్మ, బాషబోయిన ఉప్పలయ్య, దయ్యాల రాజు, జెన్నాయికోడె నగేష్, పాల్గొన్నారు.

● నూతనంగా ఏర్పడిన మోటకొండూర్ మండలాన్ని పార్టీలకు అతీతంగా ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మోటకొండూర్ మండలంలోని మాటూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గౌడ సంఘం భవనం, రూ. 20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ ప్రభుత్వ కార్యలయాలకు పక్కా భవనాలు లుక పోవడంతో ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే స్థల సేకరణ చేపట్టి ప్రభుత్వ పక్కా భవనాలు నిర్మిస్తానాని హామీ ఇచ్చారు. ఎంపీపీ పైళ్ల ఇందిర, జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఇల్లెందుల మల్లేష్ గౌడ్, సర్పంచ్ పోతిరెడ్డి స్వప్నస్కైలాబ్‌రెడ్డి, తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీవో వీరస్వామి పాల్గొన్నారు.

● గుండాల మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి, సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షమయ్య, మాసాన్‌పల్లి సర్పంచ్ ఏలూరి రాంరెడ్డి, నాయకులు కెమిడి అనిత, ద్యాప కృష్ణారెడ్డి, ఈరసరపు యాదగిరిగౌడ్, కోరుకొండ యాదగిరి పాల్గొన్నారు.

● రాజాపేట మండలం దూదివెంకటాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రభుత్వ విప్ ప్రారంభించారు. అ కార్యక్రమంలో సర్పంచ్ ధనలక్ష్మీ, ఎంపీటీసీ కవిత, బాబు, మహేందర్‌గౌడ్, పెంటయ్య, బాల్‌రాజు పాల్గొన్నారు.

సర్పంచ్‌లను ఇబ్బందిపెట్టిన గత ప్రభుత్వం



సన్మానం పొందిన సర్పంచ్‌లతో ఎంపీపీ, అధికారులు

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 29: గత ప్రభుత్వం సర్పంచ్‌లను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేసిందని ఎంపీపీ చీర శ్రీశైలం అన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు 2019 పంచాయతీ రాజ్ చట్టం ద్వార గ్రామ పంచాయతీలకు రావల్సిన నిధులపై కోత విధించి కేవలం 15వ ఫైనాన్స్ ద్వారా మాత్రమే నిధలు ఇస్తూ గ్రామాల్లో వైకుంఠధామం , హరిత హారం, రైతు వేదికలు ఇలా అనేక అభివృద్ధి పనులు చేయించి, ఇప్పటి వరకు కొన్ని గ్రామాల సర్పంచ్‌లకు నిధులు రాకపోవడంతో వారు అప్పులు తీసుకువచ్చి పనులకు పెడితే నిధులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. అభివృద్ధి విషయంలో సర్పంచ్‌లకు పూర్తిగా సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సర్పంచ్‌లకు జ్ఞాపికను అందజేసిన పూలమాల శాలువతో సన్మానం చేశారు. సమావేశంలో జడ్పీటీసీ తోటకూరి అనురాధబీరయ్య, ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఈఈ శ్రీరాం పాల్గొన్నారు.

రాజాపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌ల ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ గోపగాని బాలమణి, జడ్పీటీసీ చామకూర గోపాల్ గౌడ్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్, ఎంపీవో దినకనర్, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

భువనగిరి రూరల్ : మత్స్యకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేకు మండలంలోని వీరవెల్లికి చెందిన మత్స్యసొసైటీ అధ్యక్షుడు సోకం రాజశేఖర్ వినతిపత్రం అందజేశారు.

మోత్కూరు : హైద్రాబాదు బిర్లా ఆడిటోరియంలో నిర్వహించిన తాండవకృష్ణ భారతీయ నృత్యోత్సవంలో మోత్కూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన గొర్ల నరేందర్ కుమార్తె సితార ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. వనపర్తి ఏఎస్పీ టి.రామదాసు ఆమెకు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు.

రాజాపేట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పెల్ విజర్డ్, గ్రామాల్లో మండల స్థాయి పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి పోటీలు దోహదం చేస్తాయని రాజాపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి అన్నారు.

అడ్డగూడూరు: సుశృత గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడిగా బండారు ధనంజయను, ప్రధనకార్యదర్శిగా మందుల పరుశురాములు, కోశాధికారిగా నాయక్, గౌరవ అధ్యక్షులుగా వామనాచారి, కుమారు, నాగన్న, నరసింహలను ఆ సంఘ సభ్యులు మండల కేంద్రంలో ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. నాయకులు పి.హనుమంతురావు, డి.ఎస్.ఎన్ చారి, కందుగట్ల లక్ష్మణ్‌గౌడ్ ఉన్నారు.

భువనగిరి టౌన్: భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ సోమవారం విధుల్లో చేరారు. అంతకముందుగా బదిలీపై వెళ్తున్న సుధీర్ కృష్ణ విధుల నుంచి రిలీవ్ అయ్యారు.

భువనగిరి టౌన్: డప్పు, చెప్పు వృత్తిదారులకు పెన్షన్, స్థానిక సంస్థల అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్‌తో హైదరాబాద్‌లో పోరు గర్జన నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా ఇన్‌చార్జి గ్యార నరేష్ తెలిపారు. భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

భువనగిరి టౌన్: లబ్ధిదారులకు ప్రభుత్వం సబ్సిడీ గొర్రెలనైనా ఇవ్వాలి లేదా చెల్లించిన డీడీలకు డబ్బులు వెనక్కి ఇవ్వాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు అన్నారు. భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా పెంపకం దారులకు న్యాయం జరగడం లేదన్నారు. సమావేశంలో నాయకులు దయ్యాల నర్సింహ, బుడమ శ్రీశైలం, జహంగీర్, జమదగ్ని ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం: టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా కె.రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.శేఖర్, ఉపాధ్యక్షులుగా కొత్త కోటేశ్వర్, బి.సుశీల ఎన్నికయ్యారు.

పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భువనగిరి అర్బన్, జనవరి 29: విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు బుర్రు అనిల్, వనం రాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సోమవారం విద్యార్థులతో కలిసి ధర్నా చేశశారు. అనంతరం అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ, వసతి గృహాలు, గురుకులాలు, కేజీబీవీ, యూనివర్శిటీల పెండింగ్‌లోని డైట్, ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో లావుడియా రాజు, వేముల నాగరాజు, చింతల శివ, ఈర్ల రాహుల్, కార్తిక్, వేముల జ్యోతిబసు, పుట్టల ఉదయ్, యంబాడి సాయినాథ్, అఖిల, ఉమామహేశ్వరి, శ్రీలత, శ్వేత, ఎండీ ఫర్జీన్, నరేందర్, వంశీ, భాస్కర్, శంకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి : సీపీఐ



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

భువనగిరి అర్బన్, జనవరి 29: ఇది వరకే సిద్ధం చేసిన జాబితా ఆధారంగా అర్హులైన నిరుపేదలకు జిల్లా కేంద్రంలో ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ కోరారు. కలెక్టరేట్ వద్ద బాధితులతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఇళ్ల బాధితులు గొల్ల రాముడు, అల్లేన నరసింహులు, గొల్ల గౌరమ్మ, బోయ రాధమ్మ, రామేశ్వరమ్మ, లక్ష్మీదేవి, సుంకన్న, రాజమ్మ పాల్గొన్నారు.

ఆరెగూడెంను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి

సంస్థాన్ నారాయణపురం, జనవరి 29: సంస్థాన్ నారాయణపురం మండలం ఆరెగూడెం గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని సోమవారం గ్రామ ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు సంస్థాన్‌నారాయణపురం మండలం, జనగాం గ్రామ పంచాయితీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో ప్రస్తుతం 150కుటుంబాలు, 625జనాభా, 460ఓటర్లు ఉన్నారని తెలిపారు. 12మహిళ సంఘాల పరిధిలో 160మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కోణాల కృష్ణ, వంగూరి శ్రీశైలం, రామకృష్ణ గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల భర్తీకి ధ్రువపత్రాల అందజేత

భువనగిరి అర్బన్, జనవరి 29: ఇటీవల స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి పలు పరీక్షలు చేపట్టిన ప్రభుత్వం జిల్లాలో 84మందికి సంబంధించిన మెరిట్ జాబితాను ప్రకటించింది. ఈ మేరకు జాబితాలో అభ్యర్థులు సోమవారం కలెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో వచ్చిన వారి నుంచి అధికారులు నియమకానికి అవసరం ఉన్న ఆన్‌లైన్ ధ్రువపత్రాలను స్వీకరించారు. ఈ నెల 31న వీరికి హైదరాబాద్‌లో నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రుస్తాపూర్‌లో మల్లిఖార్జునస్వామి కల్యాణోత్సవం

తుర్కపల్లి, జనవరి 29: తుర్కపల్లి మండలం రుస్తాపూర్‌లో భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి కల్యాణోత్సవంఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ధనావతు మోహన్‌బాబు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వంకరి లావన్య, నాయకులు జి.రమేశ్, మహేందర్, నర్సింహ, సందీప్‌గౌడ్, సునీల్‌గుప్తా, శ్రీదర్‌గౌడ్, నారాయణ, సంతోష్ రెడ్డి, ర్యాకల రమేశ్, మల్లేశ్‌యాదవ్, కొండల్, జే.కరుణాకర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ కవిత వినతిపత్రం అందజేయడం హాస్యాస్పదం'

చౌటుప్పల్ టౌన్, జనవరి 29: తొమ్మిదిన్నర సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్సీ కవిత అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహాన్ని ఎందుకు పెట్టించలేదని డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ ప్రశ్నించారు. చౌటుప్పల్ పట్టణంలో సోమవారం శ్రీనివాస్ తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని పెట్టాలని స్పీకర్ కు కవిత వినతి పత్రం అందజేయడం హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు. కేసీఆర్ కుటుంబ ఆగడాలను భరించలేని ప్రజలు అసెంబ్లీ ఎన్నికలలో ఇంటికి పంపించారని, అయినా అహంకారం తగ్గలేదని ఆయన అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా భవన్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే పేరు పెట్టారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గోశిక రవి, తడక అమర్, పిల్లలమర్రి యాదగిరి, గుర్రం వెంకటేశం పాల్గొన్నారు.

సందీప్‌రెడ్డిపై మంత్రి వ్యాఖ్యలు అమానుషం

● వాస్తవాలు మాట్లాడితే పోలీసులతో నెట్టేపిస్తారా
● జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి పట్ల మంత్రి అమానుష వైఖరి
● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల, మాజీ ఎమ్మెల్యే పైళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల, మాజీ ఎమ్మెల్యే పైళ్ల

భువనగిరి టౌన్, జనవరి 29: ప్రభుత్వ వేదికను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్టీ సమావేశంగా మార్చడంతో పాటు జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి పట్ల అమానుషంగా వ్యవహరించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు దఫాలుగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ ఏ ప్రభుత్వ వేదికను పార్టీ అవసరాలకు వినియోగించలేదని విపక్షాలను కూడా వేదికపై గౌరవించిన ఘనత బీఆర్ఎస్ సొంతమన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను అమానుషంగా దూషించిన సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పార్టీ సమావేశంలోనే తప్పుబట్టారని, అదే రీతిన కాంగ్రెస్ పార్టీ కూడా స్పదించాలి మినహా అధికార వేదికలను దుర్వినియోగం చేయరాదన్నారు. ఎన్నికల హామీల అమలు కోసం నిలదీసే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని ఆ మేరకు సమాధానాలు ఇవ్వాలి కానీ సహనం కోల్పోవడం సరికాదన్నారు. జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డిని వ్యక్తిగతంలో దూషించడంతో పాటు పోలీసులచే నెట్టివేయించడం ప్రజా స్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఇప్పటికైనా మంత్రి కోమటిరెడ్డి తన వైఖరిని మార్చుకోకపోతే ఆయన పాల్గొనే ప్రతి కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వ హామీలపై నిలదీస్తారని తస్మత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏవి కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, మునిసిపల్, గ్రంథాలయ సంస్థ, రైతు బంధు మాజీ చైర్మన్‌లు, ఎనబోయిన ఆంజనేయులు డాక్టర్ జడల అమరేందర్‌గౌడ్, కె.అమరేందర్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1న అసెంబ్లీ సమీక్షా సమావేశం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 1న భువనగిరిలో బీఆర్ఎస్ అసెంబ్లీ నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సోమవారం భువనగిరిలో మీడియాకు తెలిపారు. అయితే భువనగిరి బీఆర్ఎస్ ఎంపీగా మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పోటీ చేయనున్నట్లు జరుగుతున్న ప్రచారం విలేఖరుల ప్రశ్నకు వారిరువురు స్పందిస్తూ అదిష్టానం నిర్ణయించిన అభ్యర్థిని గెలిపిస్తామని అన్నారు. భువనగిరి మునిసిపల్ కౌన్సిల్‌లో 35 మంది సభ్యులకు గాను తమకు 20 మంది సంఖ్యా బలం ఉన్నదని కొన్ని సమస్యలతో గత చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల నుంచి వైదొలిగినప్పటికీ మరోమారు బీఆర్ఎస్ జెండానే ఎగురవేస్తామని స్పష్టం చేశారు.